క్లుప్తంగా

వేడుకగా శివపార్వతుల కల్యాణం



పసుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో శివపార్వతుల కల్యాణం

పార్వతీపురం టౌన్: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన పసుపతినాథ్ బ్రహ్మసూత్ర శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణ వేడుకను వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై శివపార్వతుల ఉత్సవ మూర్తులను ఉంచి ఆలయ అర్చకులు సురేష్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కల్యాణ వేడుకను నిర్వహించారు. ప్రతీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

మక్కువ: ఐఎఫ్‌టీయూ సంఘాల విలీన సభ రాజమండ్రిలో త్వరలో జరగనున్న సందర్భంగా కార్మికులంతా పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.గోపాలం కోరారు. మక్కువలో ఐఎఫ్‌టీయూ మండల గౌరవాధ్యక్షుడు ఆధ్వర్యంల గురువారం సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్టూ పేరుతో ఇప్పటి వరకు వేర్వేరుగా పని చేస్తున్న రెండు విప్లవ సంఘాలు ఇక ఒకే సంఘంగా పని చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.గౌరు, ఎ.అప్పారావు, పి.గంగరాజు, ఆర్.అప్పారావు, బి.అప్పారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రహదారి నియమాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

పార్వతీపురం రూరల్: రహదారి నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు వాహన చోదకులను హెచ్చరించారు. పట్టణంలో ఆర్టీసీ కూడలి, రాయగడ రోడ్డు కూడలి వద్ద ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు.

సర్వేలు వేగవంతం

పాలకొండ రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం నిర్దేశించిన పలు సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వీవీ.గోపాలకృష్ణ, ఎంపీడీఓ వీవీ.రంగారావు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సచివాలయ సిబ్బందితో పంచాయతీల వారీగా సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాట్సాప్ యాప్ నిర్వహణ, గృహ లబ్ధిదారులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు, మెన్ మిస్సింగ్ వంటి సర్వేలు వేగవంతం చేయాలని సూచించారు. వేసవి నేపథ్యంలో గ్రామీణులు ఆరోగ్య పరిరక్షణ, సీజనల్ సమస్యలు అధిగమించే క్రమంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగు, సాగునీటి వనరులు, చేతి బోర్ల తాజా స్థితిగతులపై ఆరా తీశారు. రోజువారీ నివేదికలు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్



పార్వతీపురం టౌన్: ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న ఉపాధ్యాయులు



ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర సతీమణి, ఉపాధ్యాయురాలు రోజమ్మ

పార్వతీపురం టౌన్:

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, సీతానగరం, బలిజిపేట మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎన్నికలను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానా ఎన్నికల తీరును పరిశీలించారు.

బలిజిపేటలో...

బలిజిపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బలిజిపేట ఉన్నత పాఠశాలలో పోలింగ్‌ను నిర్వహించారు. కేంద్రాన్ని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పర్యవేక్షించారు. తహసీల్దార్ రత్నకుమారి, ఎస్‌ఐ సింహాచలం ఆధ్వర్యంలో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిర్వహణకు పోలీస్ బందోబస్తు పక్కాగా నిర్వహించారు.

సీతానగరంలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ సీతానగరం ఉన్నత పాఠశాల్లో గురువారం ప్రశాంతంగా జరిగింది. 111 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినిగించుకున్నారు. పోలింగ్ సరళిని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరీ సందర్శించారు. బ్యాలెట్ బాక్సులను పోలీస్ బందోబస్తు నడుమ తరలించారు.

శతశాతం పోలింగ్

మక్కువ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ మక్కువ మండలంలో శతశాతం జరిగింది. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మండలానికి చెందిన 55 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలంలో శతశాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ షేక్ ఇబ్రహీం తెలిపారు.

సాలూరులో..

సాలూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఉపాధ్యాయులు ఓటుతో పోటెత్తారు. సాలూరు పట్టణం, మండలానికి సంబంధించి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో 250 మంది ఓటర్లుకు గాను 228 ఓట్లు పోలయ్యాయి. తహసీల్దార్ ఎన్‌వీ రమణ, ఎంపీడీఓ పార్వతి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. టీడీపీ కూటమి మద్దతిచ్చిన ఏపీటీఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ శిబిరంలో స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌పీ భంజ్‌దేవ్‌లు కూర్చొవడం చర్చనీయాంశమైంది.



సీతానగరం: పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి



పార్వతీపురం టౌన్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి



బలిజిపేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

మార్చి 5న శ్రీరామ పట్టాభిషేకం

పార్వతీపురం: శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజన్ చినజీయర్ స్వామి పర్యవేక్షణలో మార్చి 5న శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమాన్ని పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు వికాస తరంగిణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీరామ పాదుకా పట్టాభిషేకం కార్యక్రమం తొలుత సౌందర్య నారాయణమూర్తి కాలనీలో నిర్వహించాలని నిర్ణయించినప్పటికీ కొన్ని అనివార్య కారణాలవల్ల కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి మార్చినట్లు పేర్కొన్నారు. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో అత్యంత వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్



యాంటీ లార్వా మందు స్ప్రేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

సీతానగరం: మండలంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. చినబోగిలిలో వైద్యాధికారి డాక్టర్ పి.ఉషా ఆధ్వర్యంలో గురువారం జరిగిన యాంటీ లార్వా మందు ద్రావణాన్ని స్ప్రేయింగ్ పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల బారిన పడడానికి కారణమైన దోమలను నిర్మూలించడానికి ముందు సర్పంచ్‌ల పర్యవేక్షణలో జాగ్రత్త చర్యలు తీసుకున్నామని తెలియపారు. అన్ని గ్రామాల్లో దోమలు నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..



రాజన్నదొరకు ధన్యవాదాలు తెలియజేస్తున్న పరిమళ

సాలూరు: తనపై ఎంతో నమ్మకంతో గురుతరమైన బాధ్యతలను అప్పగించారని ఆ దిశగా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని సాలూరు అసెంబ్లీ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులైన బోడంకి పరిమళ అన్నారు. తనకు పదవి కట్టబెట్టడంలో సహకరించిన మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు గురువారం ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యంగా పని చేయాలని రాజన్నదొర సూచించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ గుడివాడ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో మమేకమయ్యేందుకే సేవా కార్యక్రమాలు



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

- పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన

మక్కువ: గిరిజనులతో పోలీసులు మమేకమయ్యేందుకే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా తరచూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఎస్పీ అంకిత సురాన అన్నారు. మండలంలోని దుగ్గేరు గ్రామంలో ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు మక్కువ పోలీసులు మెగా వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గిరిజనులకు, పోలీస్ శాఖ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. గిరిజన యువత చెడు మార్గంలో నడవకుండా, సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. గిరిజనులకు వైద్య సేవలు అందించిన జేమ్స్ హాస్పిటల్ రాగోలు, శంబర పీహెచ్‌సీ వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు. గిరిశిఖర గ్రామాల్లోని గిరిజనులు అందరికీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యం అందాలనే ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందజేసినట్లు ఏఎస్పీ తెలిపారు.

దుప్పట్లు, వాలీబాల్ కిట్లు పంపిణీ

కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు, మహిళలకు, దివ్యాంగులకు, ఏఎస్పీ అంకిత సూరాన దుప్పట్లు, నిత్యావసర సరుకులును పంపిణీ చేశారు. గిరిజన యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు గుంటభద్ర, అలగురువు, బాగుజోల, దిగువ మెండంగి, తాడిపుట్టి గ్రామాల గిరిజన యువతకు ఉచితంగా వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మక్కువ ఎస్‌ఐ వెంకటరమణ, శంబర పీహెచ్‌సీ వైద్యులు సాహితీ, జేమ్స్ హాస్పిటల్ వైద్య బృందం, సీఆర్‌పీఎఫ్ బలగాలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

పార్వతీపురం రూరల్:

మండలంలోని నర్సిపురం గ్రామంలో కాలువల్లో పేరుకుపోయిన పూడికలను గత వారం రోజుల నుంచి సచివాలయ కార్యదర్శి అంపోలు కూర్మారావు పర్యవేక్షణలో తొలగిస్తున్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా కావడంతో పాటు ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోయాయని పలువురు అధికారులకు అభ్యర్థించడంతో పూడికలను పంచాయతీ నిధులతో తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఆయా వీధుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ రమణమూర్తి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించడం జరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా క్రాష్ ప్రోగ్రాం ద్వారా బోర్లకు మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ బంగారమ్మ తదితరులున్నారు.



నర్సిపురంలో వీధి కాలువల్లో పూడికలు తీస్తున్న పారిశుధ్య కార్మికులు

కార్మిక హక్కులను కాలరాస్తున్న 'కూటమి'



కార్మిక హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గాదెల సర్వేశ్వరరావు మండిపడ్డారు. ఐఎఫ్‌టీయూ విలీన సభ మార్చి 2న జరగనుండడంతో దానికి సంబంధించిన పోస్టర్‌ను పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక మోసపూరిత విధానాలు అవలంభిస్తుండడంతో వేర్వేరుగా ఉన్న ఐఎఫ్‌టీయూ రెండు సంఘాలు ఒకటవుతున్నాయన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

ప్రజా భాగస్వామ్యంతోనే పరిశుభ్రత



పట్టణ పారిశుధ్యానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరులు అన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పారిశుధ్యానికి సిబ్బంది కృషి చేస్తుందని, దీనికి ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

– పార్వతీపురం టౌన్

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు

- బువ్వ పెట్టని కులవృత్తి
- అలాగని విడవలేని పరిస్థితి



వెంగాపురంలో బుట్టలు అల్లుతున్న మేదరలు

బలిజిపేట: అనాదికాలం నుంచి చేతివృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నా.. కడుపునిండా కూడుకు కరువవుతున్నామని మేదరవృత్తి చేసుకునే మేదరులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అనాది కాలం నుంచి వంశపారంపర్యంగా చేతివృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని ఈ రోజుల్లో చేతివృత్తి పనులు తక్కువయ్యాయని మేదర వృత్తిదారులు ఆవేదన చెందుతున్నారు. గతంలో చేతి నిండా పని చేసి అల్లిన వాటిని గ్రామాల్లోకి వెళ్లి విక్రయించేవారిమని, ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించిన పనిముట్లు తయాచేసి విక్రయించే వారమని వారు పేర్కొంటున్నారు. రోజులు గడిచేకొద్దీ గ్రామాలకు వెళ్లి అమ్మాల్సిన పరిస్థితి లేకుండా పోయిందన్నారు. చేతివృత్తి పని తగ్గిపోవడంతో పిల్లలు ఏదో జీవనోపాధికి బయటకు వెళ్లిపోతున్నారని తెలిపారు. దానికి కావాల్సిన కలపను నేరుగా తెచ్చుకోలేక దళారుల దగ్గర వాటిని కొనుగోలు చేసుకుని ఇప్పట్లో అరకొరగా పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామంటున్నారు.

గతంలో గిరాకీ

గతంలో వెదురుతో చేసే సామగ్రికి ఎక్కువ గిరాకీ ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో రైతు కుటుంబాలు ఎక్కువగా తమ సామగ్రిపై ఆధారపడి తమ జీవనం కొనసాగించేవారు. వారికి వ్యవసాయంతో పాటు పాడి ఉండేది. వ్యవసాయానికి అవసరమైన తట్టలు, చాటలు, గంపలు, బుట్టలు వంటివి ఎక్కువగా తయారుచేసేవారు. పంటలు పండించే సమయంలో కళ్లాలలో వాటి వినియోగం ఎక్కువగా ఉండేది. ధాన్యాలను నిల్వ చేసేందుకు వెదురుచాపలు వినియోగించేవారు. ఇళ్ల వద్ద కోళ్ల పెంపకాలు జరిపేటప్పుడు వాటికి రక్షణగా బుట్టలు బోర్లించి ఉంచేవారు. నివాసగృహాల వద్ద, కళ్లాలలో చాటల వినియోగం ఎక్కువగా ఉండేది. దీంతో గ్రామాల్లో సైకిళ్లపై, కావిళ్లతో సరుకులు తీసుకువెళ్లి విక్రయించేవారు. కొంతమంది రకరకాల వస్తువులు ఆర్డర్లు ఇచ్చేవారు. వాటిని తయారుచేసి వారికి అప్పగించేవారు. చేతినిండా పని ఉండేది. కాలక్రమేణా వ్యవసాయ విధానంలో మార్పులు రావడంతో వెదురుతో చేసే పరికరాల అవసరాలు లేకుండా పోయాయి. కనీసం ఇంట్లో చాటల వినియోగంలోనూ ప్లాస్టిక్ చాపల వినియోగం ఎక్కువైంది. దీంతో చేతివృత్తి చతికిలపడింది.

గత ప్రభుత్వంలో అండ ఉండేది

గత ప్రభుత్వంలో అర్హులు ఉంటే సంక్షేమ పథకాలు అందేవి. జీవనోపాధికి కులవృత్తికి తోడు పథకాలు అందుతుండడంతో జీవనోపాదులు గడిచేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఇప్పటికి ఎటువంటి పథకం అందలేదు. దీంతో జీవనోపాదులు కష్టమవుతున్నాయని కులవృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కర్రలను సాపు చేస్తున్న మేదరి

చేతివృత్తి విడువలేక..



ఇప్పుడు చేస్తున్న చేతివృత్తి విడువలేక పని చేస్తున్నాం. జీవనోపాధి కష్టంగా ఉంటుంది. గతంలో ఎక్కువ పని ఉండేది. ఇప్పుడు రకరకాల ప్లాస్టిక్ వస్తువులు రావడంతో వెదురుతో తయారుచేసే పరికరాలకు డిమాండ్ తగ్గింది. ఏదో పని చేస్తున్నాం అంతే.

– అప్పారావు, చేతివృత్తి పనిదారు, వెంగాపురం, బలిజిపేట మండలం

అంతిమ సంస్కారానికీ అవస్థలే..

వీరఘట్టం: మేజర్ పంచాయతీలోని దొంతరవీధి వాసులకు సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో నిత్యం నరకయాతన పడుతున్నారు. ఈ విషయం పక్కన పెడితే వీధిలో ఎవరైనా చనిపోతే ఆ శవాన్ని శ్మశానవాటికకు తీసుకువెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో ఈ వీధి వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వీధిలో ఓ వ్యక్తి గురువారం కన్నుమూయడంతో మృతదేహాన్ని శ్మశానికి తీసుకెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కోరినా.. ఇంత వరకు పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శ్మశానికి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.